ప్రజాశక్తి

శుక్రవారం 6 జూన్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అంచనాలు పెంచేశారు..!

◆ ఎపి టూరిజం హరిత రెస్టారెంట్ మరమ్మతులు, పునర్నిర్మాణ పనులకు శ్రీకారం

◆ 2023లో రూ.8 కోట్లు.. కొత్త ప్రభుత్వంలో రూ.13.5 కోట్లు

◆ నిధులు కొల్లగొట్టే చర్యలు ◆ అమరావతి నుంచి చక్రం తిప్పిన అధికారులు



అప్పుఘర్‌లోని హరిత హోటల్ అండ్ రెస్టారెంట్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దుబారా జరగకుండా పాలన సాగిస్తామంటూ ఎన్నికల సమయంలో చెప్పుకొచ్చిన 'కూటమి' అధికార పీఠం దక్కాక అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. విశాఖ నగర నడిబొడ్డున సీ వ్యూ (అప్పుఘర్) వద్దగల ఎపి టూరిజానికి చెందిన హరిత హోటల్, రెస్టారెంట్ అండ్ బార్ మరమ్మతులు, పునర్నిర్మాణానికి సంబం ధించి నిధుల అంచనాలను రూ.కోట్లకు పెంచేసిన వైనమే దీనికి తార్కాణం. ఎపి టూరిజం విశాఖ జిల్లా అధికారులకు కనీసం కాగితంపై కూడా సమాచారాన్ని అమరా వతి ఎపి టూరిజం ఇంజినీరింగ్ అధికారులు ఇవ్వకుండా మరమ్మతుల పేరుతో రూ.కోట్లు కొల్ల గొట్టే చర్యలకు దిగారన్నది స్పష్ట మవుతోంది.

నాడు ఎంత ? నేడు ఎంత ?

ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిటిడిసి) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న అప్పుఘర్ వద్దగల హరిత హోటల్, రెస్టారెంట్ అండ్ బార్ (ఎసి అకామడేషన్)లో మరమ్మతు పనులను గత ప్రభుత్వం రూ.8.6 కోట్లతో 2023లో ప్రారంభించింది. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రూ.13.5 కోట్లుగా సవరించిన అంచనాలతో పనులకు శ్రీకారం చుట్టింది. సుమారు రూ.5.50 కోట్ల మేర అంచనాలను పెంచేయడం వెనుక అమరావతి ఎపి టూరిజం అధికారుల హస్తం ఉంది. విశాఖపట్నం జిల్లా ఎపి టూరిజం రీజనల్ డైరెక్టర్ జగదీష్‌ను ఈ విషయమై 'ప్రజాశక్తి' వివరాలు కోరగా అంతా అమరావతి ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతోందని, తమకు తెలియదని తెలిపారు. 8 సెంట్ల స్థలంలో ఉన్న ఈ భవనాన్ని ఉన్న ఫలంగా ధ్వంసం చేసి కొత్తగా నిర్మాణం చేసినా ఇంత ఖర్చవుతుందా ? అంటూ స్థానికులు పెదవి విరుస్తున్నారు.

మొత్తం పనులన్నింటినీ చేపడుతున్నాం : అసిస్టెంట్ ఇంజినీర్ సీతారామ్

ఎపి టూరిజానికి చెందిన అసిస్టెంట్ ఇంజినీరు సీతారామ్ హరిత రెస్టారెంట్ పునర్నిర్మాణ పనులపై స్పందిస్తూ 2023 అక్టోబర్‌లో రూ.8.6 కోట్లతో అంచనాలు మిగతా 2లో..



సిద్ధమైన కౌన్సిల్ మీటింగ్ హాల్

నేడు జివిఎంసి కౌన్సిల్

◆ 27 అంశాలతో అజెండా

◆ అభివృద్ధి పనుల్లో అవకతవకలపై చర్చ జరిగే అవకాశం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జివిఎంసి) సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో జరుగనుంది. అజెండాలో 27 అంశాలను పొందుపరిచారు. ఇటీవల కాలంలో నగర పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్లో అవకతవకలపై కౌన్సిల్‌లో పలువురు కార్పొరేటర్లు ప్రశ్నించే అవకాశముంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయంలో నగరం కోసం ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాలని గతంలో తీర్మానం చేశారు. తాజాగా ప్లాంట్‌లో జరుగుతున్న పలు పరిణామాలను సిపిఎం, సిపిఐ కార్పొరేటర్లు డాక్టర్ బి.గంగారావు, స్టాలిన్ ప్రస్తావించే అవకాశాలున్నాయి. పన్నుల భారంపైనా చర్చ జరుగనుంది. కోడి వ్యర్థాల టెండర్లు, అందులో అక్రమాలపై కొంతమంది కౌన్సిల్ సభ్యులు చర్చించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 21న దేశ ప్రధాని మోడీ విశాఖలో యోగాంధ్ర పేరుతో నిర్వహించే క్రతువు ఉండనే ఉంది. దీనికోసం జివిఎంసి, మిగతా 2లో..

కార్మికుల పని గంటల పెంపు దుర్మార్గం

▶ వార్త 5లో..

విశాఖ రైల్వే జోన్ జిఎంగా సందీప్ మాథూర్

▶ వార్త 2లో..

ప్రశాంతంగా లా సెట్, ఎడ్ సెట్ పరీక్షలు

▶ వార్త 3లో..



నక్కపల్లిలో మొక్క నాటి నీరుపోస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ఘనంగా పర్యావరణ దినోత్సవం

పలుచోట్ల అవగాహనా ర్యాలీలు, మొక్కల పంపిణీ, నాటివేత వార్తలు 7లో..

గిరి ప్రదక్షిణకు పకడ్బందీ ఏర్పాట్లు

◆ గత లోపాలు పునరావృతం కారాదు

◆ సమీక్షా సమావేశంలో విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జులై 9, 10వ తేదీల్లో ఆషాఢ పౌర్ణమి రోజున జరిగే శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి గిరి ప్రదక్షిణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో ముందుకు సాగాలని దిశా నిర్దేశం చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ తలెత్తకుండా చూడాలన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై గురువారం సాయంత్రం జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. భక్తులు జాతీయ రహదారిని దాటే చోట తాత్కాలిక ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని కలెక్టర్, సిపి శంకబ్రత బాగ్చీ అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి ఎన్‌హెచ్ఎఐ వారితో సమన్వయం చేసుకొని తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. క్యూలైన్లను పక్కాగా ఏర్పాటు చేయాలని, గాలి, వానలకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. సమీక్షలో భాగంగా జిల్లా కలెక్టర్ వివిధ అంశాలపై మిగతా 2లో..



విశాఖలోని పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మొదటి పేజీ తరువాయి..

అంచనాలు పెంచేశారు..!

తయారు చేసి పనులు ప్రారంభించామని, తాజాగా రూ.13.5 కోట్లకు అంచనాలు పెరిగాయని అన్నారు. పూర్తిస్థాయి పునర్నిర్మాణ పనులు జరుగుతున్నందున భారీగా నిధుల వ్యయం పెరిగిందన్నారు. మరో నెల రోజుల్లో సర్వ హంగులతో హరిత రెస్టారెంట్ సిద్ధం కానుందని తెలిపారు.

నేడు జివిఎంసి కౌన్సిల్

విఎంఆర్‌డిఎ, ఎపి టూరిజం సహా వివిధ శాఖలు రూ.100 కోట్ల మేర ఖర్చుచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రజా ధనం, పన్నుల రూపంలో వసూలైన జివిఎంసి నిధుల నుంచి కూడా వ్యయం చేయనున్నారు. ఈ అంశంపైనా చర్చ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కరోనా వ్యాప్తి ప్రచారం, ప్రజల్లో భయాందోళనలు నెలకొన్న నేటి తరుణంలో 'యోగా డే' వంటివి లక్షల మంది జనాన్ని సమీకరించి నిర్వహించడం తగునా ? అనే అంశంపైనా కౌన్సిల్‌లో వామపక్ష సభ్యులు ప్రశ్నించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏటా నిర్వహించే డీ సిల్టింగ్ పనుల కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్న జివిఎంసి ఇంజినీరింగ్, ప్రజారోగ్య శాఖల తీరు, టెండర్లు, సోషల్ ఆడిట్ నిర్వహణ జరగకపోవడం వంటి అంశాలపైనా పలువురు మాట్లాడనున్నారు. నగరంలో పెరుగుతున్న కాలుష్యం, ప్లాస్టిక్ వినియోగం మళ్లీ మొదటికే రావడం, ఇంతవరకూ జివిఎంసి వాటి ప్రచారం కోసం చేసిన రూ.కోట్ల ఖర్చుపైనా చర్చ జరగనుంది. జివిఎంసి నూతన మేయర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పీలా శ్రీనివాసరావుకు ఇది మొదటి కౌన్సిల్ కానుంది.

గిరి ప్రదక్షిణకు పకడ్బందీ ఏర్పాట్లు

మాట్లాడారు. జులై 9న తెల్లవారు జాము నుంచి 10వ తేదీ సాయంత్రం వరకు దర్శనాలు ఉంటాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కొండదిగువ తొలి పావంచా వద్ద భక్తులను, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీస్ బందోబస్తు, పోలీస్ శిబిరాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూలైన్లు, రద్దీ ప్రదేశాలు వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు, తోపులాటలు లేకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, మరుగుదొడ్లు, రద్దీ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, ముందుగానే పారిశుధ్య చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆలయ ఇఒ సూచనల మేరకు అవసరమైన అంబులెన్సులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు ప్రదక్షిణ చేసే ప్రాంతాలతో పాటు రద్దీ ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ కొనసాగాలని, అవసరమైన మేరకు జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అప్పుఘర్ వద్ద అధిక సంఖ్యలో భక్తులు స్నానాలు చేసే సమయంలో ఏ విధమైన నీటి ప్రమాదాలూ జరగకుండా ఉండేందుకు మైక్ ద్వారా జాగ్రత్తలు చెప్పాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన బస్సులను నడపాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. సమావేశంలో భాగంగా ప్రధాన అర్చకులు వైధిక కార్యక్రమాల షెడ్యూల్‌ను వివరించారు.

32 కిలోమీటర్ల మేర వసతులు

ఆలయ ఇఒ వేంద్ర త్రినాథరావు మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం తరపున చర్యలు చేపడుతున్నామని, 32 కిలోమీటర్ల మేర వసతులు సమకూరుస్తున్నామని, గుర్తించిన 28 ప్రదేశాల్లో 290 తాత్కాలిక టాయిలెట్లు, 129 శాశ్వత టాయిలెట్లు, జివిఎంసి ఆధ్వర్యంలో మరొక 29 శాశ్వత టాయిలెట్లు, 31 వైద్య శిబిరాలు, 6 ప్రధాన ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కొండపైన 170, దిగువన 58 సిసి కెమెరాలు ఉన్నాయని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మరిన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. తొలి పావంచా వద్ద అవసరానికి తగిన విధంగా కొబ్బరికాయలు కొట్టేందుకు కౌంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో ఎడిసిపిలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, ఆర్‌డిఒ సంగీత్ మాథుర్, వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న శివరామ దత్తాత్రేయ తదితరులు

ఐఐటి జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో..

శ్రీ రామానుజన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఐఐటి జెఇఇ అడ్వాన్స్‌డ్ - 2025 ఫలితాల్లో విశాఖ నగరానికి చెందిన శ్రీ రామానుజన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు విజయ కేతనం ఎగరవేశారు. ఒకే క్యాంపస్ నుండి ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వైడి.సూర్య శేఖర్, ఆర్.సత్యం నాయుడు, ఇ.తన్మయి సాయి ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ వెలగా శివరామ దత్తాత్రేయ మాట్లాడుతూ విలువలను పెంపొందిస్తూ, నాణ్యమైన విద్యను అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు. కళాశాల అధ్యాపకుల కృషి మరువలేనిదన్నారు.

విశాఖ రైల్వే జోన్ జిఎంగా సందీప్ మాథూర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు చేసిన సౌత్ కోస్ట్ రైల్వే తొలి జనరల్ మేనేజర్‌గా ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీర్స్, హయ్యర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్‌కు చెందిన సందీప్ మాథూర్‌ను నియమిస్తూ రైల్వే బోర్డ్ జాయింట్ సెక్రటరీ విక్రమ్ సింగ్ దాహియా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సందీప్ మాథూర్ సిగ్నల్ మోడర్నైజేషన్ ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

విశాఖ రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్‌ను నియమించాలని జనవరి 21న విశాఖ ఎంపీ శ్రీభరత్ రైల్వే మంత్రికి లేఖ రాశారు. జోన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలంటే కచ్చితంగా జిఎం అవసరమని దానిలో విన్నవించారు. ఆ లేఖకు కేంద్రం స్పందించినట్టు శ్రీభరత్ గురువారం చెప్పుకొచ్చారు. ఇప్పటికే వాల్తేరు డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ సాకారమైందని, త్వరితగతిన గజిట్ నోటిఫికేషన్ కూడా వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ డిఆర్‌యుసిసి మెంబర్ చలసాని గాంధీ, రైల్వే, దాని అనుబంధ సంఘాల నాయకులు ఎంపీ శ్రీభరత్‌కు ధన్యవాదాలు తెలిపారు.

వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న శ్రీనుబాబు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశ వ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాలను కేంద్రం రద్దు చేసిందని, తక్షణమే వాటిని పునరుద్ధరించాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్ఎజె) గంట్ల శ్రీనుబాబు, ఎపిడబ్ల్యుజెఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ డిమాండ్ చేశారు. ఆ చట్టాలను పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 9న జాతీయ కార్మిక సంఘాలు నిర్వహించే వివిధ కార్యక్రమాలకు వర్కింగ్ జర్నలిస్ట్‌ల ఫెడరేషన్, బ్రాడ్‌కాస్ట్, చిన్న, మధ్య తరహా పత్రికల సంఘాలు మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. గురువారం డాబాగార్డెన్స్ కూడలిలోని ఓ ప్రైవేట్ కార్యాలయంలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 44 కార్మిక చట్టాలను కేంద్రం రద్దు చేయగా అందులో వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1955, వేతనాల చెల్లింపుల చట్టం 1958 ఉన్నాయన్నారు. వాటి రద్దుతో జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కోనున్నారన్నారు. వీటి పునరుద్ధరణకు కేంద్రం చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఈ నెల 11న జర్నలిస్ట్స్ డిమాండ్స్ డే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్న తరుణంలో వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన అనేక అంశాలను పరిష్కరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అందుకు సంబంధించిన పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ఆ రోజు జిల్లా కలెక్టరేట్‌లోనూ, తహశీల్దార్ కార్యాలయాల్లోనూ, అలాగే ప్రజాప్రతినిధులకు అందజేస్తామన్నారు. సమావేశంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్‌కాస్ట్ సంఘం జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కింతాడ మదన్, చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షులు జగన్మోహన్, కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ధవళేశ్వరపు రవికుమార్, సాంబశివరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై ప్రతిపాదనలు అభినందనీయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందన, ప్రతిపాదనలు అభినందనీయమని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వ సభ్యులు ప్రొఫెసర్ కెఎస్.చలం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం అభివృద్ధిపై కేంద్ర మంత్రి చూపిస్తున్న శ్రద్ధ, చేపట్టిన కార్యాచరణ ప్రశంసనీయమన్నారు. ముఖ్యంగా పాతపట్నం అమ్మవారి గుడి మీదుగా వెళుతున్న బ్రిడ్జి డిజైన్ మార్చి గుడికి అడ్డులేకుండా వుండాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరడం మంచిదేనన్నారు. నరసన్నపేట నుండి ఇచ్ఛాపురానికి ఆరు లైన్ల రోడ్డు కావాలని కోరడం శుభపరిణామమన్నారు. అయితే అది శ్రీకాకుళం నుంచి ఉంటే బావుటుందన్నారు. అదే విధంగా బుద్ధిని దంతం ఉన్న చారిత్రక ప్రదేశం దంతపురమని, ఆనాటి కళింగ రాజధాని సింహపురం - సింగుపురాన్ని కేంద్ర ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ ఆధీనంలోకి తీసుకొని పర్యాటక ప్రాంతంగా మార్చాలని కోరాలని చలం విజ్ఞప్తి చేశారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన దంతపురం భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యతని జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీ శంకర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల కార్మిక రహిత విశాఖ కోసం అన్ని డిపార్ట్మెంట్లు కలిసి పనిచేయాలని అన్నారు. బాలల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాలలకు ఎదురయ్యే వివిధ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

మత్స్యకారులంటే చంద్రబాబుకు చిన్నచూపు



యశ్వంత్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మత్స్యకారులు అంటే చంద్రబాబుకు చిన్న చూపు అని, వారి హక్కులను కాలరాస్తున్నారని వైసిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. గురువారం 34వ వార్డుకు చెందిన మత్స్యకారుడు అరిజాల అప్పారావు కుమారుడు యశ్వంత్ విద్యకు తన సొంత నిధులు రూ.10 వేలను గణేష్ కుమార్ ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల్లో నిరక్షరాస్యత అధికంగా ఉందన్నారు. అందువల్ల చేసుకునే వృత్తిలో కూడా వారు మోసాలకు బలైపోతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారులకు అందాల్సిన జీవనభృతి, మత్స్యకార భరోసాను అర్హులందరికీ ఇవ్వలేదని ఆరోపించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, వైసిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రేసు అనురాధ, ఎర్రమ్మ తల్లి, లండ రమణ, అంబటి అప్పలరాజు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా లా సెట్, ఎడ్ సెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలం శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటి కళాశాలలో గురువారం ఏపీ లా సెట్, ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. ఉదయం నిర్వహించిన లా సెట్ పరీక్షకు మొత్తం 200 మందికి గానూ 155 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలను కళాశాల పరిశీలకులు రామాంజనేయులు పర్యవేక్షించారు. లా సెట్ ప్రత్యేక పరిశీలకునిగా డాక్టర్ సివిఎస్.రవీంద్రనాథ్ వ్యవహరించారు.

మధ్యాహ్నం నిర్వహించిన ఏపీ ఎడ్‌సెట్ పరీక్షకు 200 మందికి 168 మంది హాజరయ్యారు. ఎడ్‌సెట్ ప్రధాన పరిశీలకునిగా ఆంధ్ర యూనివర్సిటీ నుంచి డాక్టర్ పిఆర్.ప్రకాష్‌రావు వ్యవహరించారు. పరీక్షల సమయంలో పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

బోరు నిర్మాణ పనులు అడ్డగింతపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని కొవ్వాడ గ్రామంలో తాగునీటి బోరు నిర్మాణ పనులను అడ్డగించిన వ్యక్తులపై ఆ గ్రామానికి చెందిన బి.నాగమణి తహశీల్దార్ ఆనందరావుకు, ఎంపిడిఒ విజయ్‌కుమార్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. పంచాయతీ, పాత కొవ్వాడ గ్రామ ఆర్ అండ్ బి రోడ్డు పక్కన తమటపు వారి వీధిలో తాగునీటి బోరు ప్లాట్ ఫారం నిర్మాణ పనులను అడ్డగిస్తున్న సిరికి త్రిమూర్తులు, మరి కొంతమంది వ్యక్తులపై సిఐ శ్రీధర్‌కు ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి హరీష్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ తాగునీటి బోరు నిర్మాణానికి జివిఎల్ నరసింహారావు ఎంపీ అభివృద్ధి నిధుల నుంచి జిల్లా కలెక్టర్ రూ.1.20 లక్షలు మంజూరు చేశారు.

భవన నిర్మాణ కార్మికులకు సమగ్ర చట్టం అమలుచేయాలి

ప్రజాశక్తి-కొమ్మాది : భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం సమగ్ర చట్టం అమలు చేయాలని విశాఖ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) మధురవాడ జోన్ ప్రధాన కార్యదర్శి పేడాడ రాజశేఖర్ డిమాండ్ చేశారు. విశాఖ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం 6వ జిల్లా మహాసభలను ఈనెల 15వ తేదీన మధురవాడలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను కొమ్మాది కూడలిలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.రాజ్‌కుమార్, రాజశేఖర్ మాట్లాడుతూ, ఇటీవల కాలంలో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి తగ్గిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులతో పాటు చిన్న చిన్న కాంట్రాక్టర్లు, బిల్డర్లు, యజమానులు నిర్మాణాలు పూర్తిస్థాయిలో చేయలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ ప్రభావం కార్మికుల ఉపాధిపై పడిందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ వాటాతో కూడుకున్న పిఎఫ్, ఇఎస్ఐ అమలుచేయాలని డిమాండ్ చేశారు. భవన, ఇతర నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డు పనిచేసే విధంగా ప్రభుత్వం చూడాలని, పెండింగులో ఉన్న క్లెయిమ్‌లు, గుర్తింపు కార్డులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి.తిరుపతి, ఎ.లక్ష్మణ, బి.నాగేశ్వరరావు, వెంకటేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మిక నాయకులు

ఎన్ఎస్ఆర్ఐటి, బిఎస్ఎన్ఎల్ మధ్య అవగాహనా ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఎన్ఎస్ఆర్ఐటి, బిఎస్ఎన్ఎల్ ప్రతినిధులు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని శొంఠ్యాంలోని నడింపల్లి సత్యనారాయణ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, భారత సంచార నిగమ్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంభూ ప్రసాద్ తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులకు ఆధునిక సాంకేతిక రంగాలలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి దోహదపడేలా ఈ ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు. ఈ ఒప్పందం కింద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ , మెషీన్-టు-మెషీన్ కమ్యూనికేషన్, రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీస్, జనరేటివ్, డిజిటల్ ట్విన్, ఇండస్ట్రీ 4.0 సంబంధిత భావనలపై నైపుణ్యం పెంపొందించేందుకు ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయని తెలిపారు. విద్యార్థులకు పరిశ్రమ అనుభవం, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టుల రూపంలో ప్రాయోగిక అవగాహన లభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిఎస్ఎన్ఎల్‌కు ఎన్ఎస్ఆర్ఐటి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభుప్రసాద్, చీఫ్ మెంటరింగ్ అధికారి డాక్టర్ పిఎస్.రాజు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో బిఎస్ఎన్ఎల్ మద్దతు ఎంతో విలువైనదిగా పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా, ఎన్ఎస్ఆర్ఐటి ఆధునిక సాంకేతిక విద్యకు కేంద్రబిందువుగా ఎదిగి, డిజిటల్ యుగం అవసరాలకు తగిన నైపుణ్యాలతో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు లక్ష్యంగా పెట్టుకుందని ప్రిన్సిపల్ వివరించారు.

బిటి.రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కొమ్మాది : జివిఎంసి 5వ వార్డు పరిధి నగరంపాలెం నుంచి శివశక్తినగర్ రోడ్డును కలుపుతూ సుమారు రూ.43 లక్షల వ్యయంతో వేస్తున్న బిటి రోడ్డు పనులను కార్పొరేటర్ మొల్లి హేమలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే వార్డులో సుమారు రూ.ఐదు కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి సాయిరాం కాలనీ కొండవాలు ప్రాంతాల్లో సుమారు రూ.మూడు కోట్లతో స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నామని, పరదేశిపాలెం నుంచి నేషనల్ హైవే వరకు సుమారు రూ.40 లక్షలతో బిటి రోడ్డు, వికలాంగుల కాలనీ నుంచి వైఎస్ఆర్ కాలనీ వరకు సుమారు రూ.43 లక్షలతో బీటీ రోడ్డు, కొమ్మాది పెట్రోల్ బంక్ నుంచి వికలాంగుల కాలనీ వరకు సుమారు రూ.45 లక్షలతో కాలువలు, బిటి రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. వార్డులో సుమారు రెండు కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, కాలువలు, మెట్ల మార్గాలు, సామాజిక భవనాల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు చెప్పారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహకారంతో ఏడాది కాలంలోనే ఈ పనులన్నీ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, టిడిపి పార్లమెంటరీ ఉపాధ్యక్షులు వాండ్రాశి అప్పలరాజు, వార్డు అధ్యక్షులు నాగోతి సత్యనారాయణ, ఈగల రవి, కురుమోజు శ్రీను, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికల తొలగింపు

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి 5,6,7 వార్డులలో కొమ్మాది నుంచి క్రికెట్ స్టేడియం వరకు రోడ్డుకిరువైపులా కాలువలో పూడికలు వ్యర్థాలు తొలగింపు చేపట్టే పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం స్థానిక కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిళ్ళా మంగమ్మతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం గంటా మాట్లాడుతూ, సర్వీస్ రోడ్డులో ఉన్న కాలువలో పూడికలు వల్ల చిన్నపాటి వర్షానికి కూడా సర్వీస్ రోడ్డు ముంపునకు గురవుతోందని తెలిపారు. రూ.74.50 లక్షలతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమిలి జనసేన ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల, మొల్లి లక్ష్మణరావు, పిళ్ళా వెంకటరావు, వాండ్రశి అప్పలరాజు, మామడి దుర్గారావు, నాగోతి సత్యనారాయణ, నాగోతి నరసింహనాయుడు, కానూరి అచ్యుత్ రావు, పిళ్ళా శ్రీను, పోతిన తిరుమలరావు, బోయి శ్రీను, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని విశాఖలో పలుచోట్ల గురువారం ఘనంగా నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ పలుచోట్ల ర్యాలీలు, మొక్కలు నాటివేత కార్యక్రమాలు నిర్వహించారు.

వేపగుంట : జివిఎంసి 96వ వార్డు పరిధి పెందుర్తి ఆదిత్య నగర్ పార్కులో మేయర్ పీలా శ్రీనివాసరావు మొక్కలు నాటారు. అనంతరం ఆదిత్యనగర్ నివాసితులు, అధికారులతో కలసి పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.హేమావతి, ఎఎమ్ఒహెచ్ బి.అప్పలనాయుడు, కె.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పెందుర్తి : ఆదర్శ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టి.థియోఫిలస్, ఎన్ఇ.ఫ్లోరా, ఎ.శ్రీనివాసరావు, తవ్వవానిపాలెం సర్పంచ్ బి.స్వామినాయుడు పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ చైర్మన్ డి సౌజన్య మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు కె.మంజుల, డి.కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

వైఎంసిఎ ఆధ్వర్యాన జివిఎంసి 3, 4 వార్డుల పరిధి బీచ్ రోడ్డు, చేపలుప్పాడ ప్రాంతాల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌సి బమ్మి అయ్యప్పనాయుడు, వైఎంసిఎ ప్రతినిధులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : చిప్పాడ దివీస్ సంస్థ ఆధ్వర్యాన ఎర్రయ్యపాలెం తీరంలో చెత్తను తొలగించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై గ్రామస్తులకు సంస్థ ఉద్యోగులు అవగాహన కల్పించారు. అన్నవరం నుంచి తూడెం వెళ్లే మార్గంలో ఒక్కో ఉద్యోగి ఒక్కో మొక్క చొప్పున 2000 మంది మొక్కలు నాటారు. ప్లాస్టిక్ కాలుష్యం అంతం చేయండి అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో దివీస్ డైరెక్టర్ ఎస్.దేవేందర్‌రావు, ఎల్‌వి.రమణ, వైఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

స్థానిక ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో నిర్వహించిన పర్యావరణ దినోత్సవంలో ఎస్ఐ గౌరి, విలేజ్ తల్లులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తగరపువలస అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఎన్ఎస్ఎస్, రెడ్ క్రాస్ సంయుక్తాధ్వర్యాన విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, చంద్రశేఖర్, షరీఫ్ పాల్గొన్నారు

మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ పర్యావరణ శాస్త్ర విభాగం ఆధ్వర్యాన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. గీతం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా గీతం ఆవరణలో మొక్కలు నాటారు. గీతం సైన్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి, కె.నాగేంద్రప్రసాద్, ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆనందపురం : ఆనందపురం మండలంలోని గిడిజాల పంచాయతీ పరిధి దెబ్బడిపాలెంలో ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కార్మికులతో కలిసి శ్రీ మహాలక్ష్మి కల్చర్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ కొబ్బరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కోరాడ వైకుంఠం, ఎడ్ల సాంబ అప్పలరాజు, అప్పలరమణ పాల్గొన్నారు.

ఆనందపురం మండలం వేములవలసలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోతిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కెఎన్.రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆనందపురం మండలంలోని గ్రామాల్లో 4179 మొక్కలు నాటినట్లు ఎంపిడిఒ వి.జానకి తెలిపారు. తర్లువాడ పంచాయతీ బిసి కాలనీలో హౌసింగ్ పిడి సత్తిబాబు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు, మజ్జివెంకటరావు పాల్గొన్నారు. ఎల్‌వి.పాలెం ఎస్‌డబ్ల్యు పిసి షెడ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ జానకి, సర్పంచ్ రాజేశ్వరి రమణ పాల్గొని పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

గాజువాక : జివిఎంసి 74వ వార్డు పరిధిలో జోనల్ కమిషనర్ శేషాద్రి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, పల్లా రమణ, వియ్యపు కొండబాబు పాల్గొన్నారు.

ఆరిలోవ : విఎంఆర్‌డిఎ ఆధ్వర్యాన కైలాసగిరిపై స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. చెత్తను తొలగించారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, భవానీశంకర్, రామరాజు పాల్గొన్నారు.

లీగల్ : జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఎసి), జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.వెంకటరమణ మొక్కలు నాటారు. అనంతరం న్యాయమూర్తులు, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎల్ఎస్ఎ కార్యదర్శి (ఎఫ్ఎసి) ఎం.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాస్, ఎల్‌పి.నాయుడు పాల్గొన్నారు.

సీతమ్మధార : సీతమ్మధార రైతు బజార్‌లో ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జివిఎంసి 25వ వార్డులో స్థానిక కార్పొరేటర్ పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

వైద్య విభాగం, జివిఎంసి, శ్రీగాయత్రీ వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ ఆధ్వర్యాన ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆవరణలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వేప మీనాక్షి, శ్రీనివాస రాజమణి, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం అబిద్‌నగర్‌లో శుభోదయం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన 300 జనప నార సంచులు ప్రత్యేకంగా తయారు చేయించి పంపిణీ చేశారు. ప్రతి సంచితో పాటు ప్రతిజ్ఞ కరపత్రం అందించారు.

డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, డాక్టర్ హారిక, జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయ సిబ్బంది పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలో సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, టివి.సూర్యప్రకాష్, సీజీఎంలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు డి.సుమన్‌కుచ్చుఖ్వణి, వి.విజయలలిత, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యలపై పిఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యులకు వినతి



పాండేకు వినతి పత్రం అందజేస్తున్న జిటిపి ప్రకాష్ తదితరులు

ప్రజాశక్తి - గాజువాక : పలు సమస్యలపై కేంద్ర పిఎఫ్ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు హిరణ్మాయ జయదేవ్ పాండ్యాకు ప్రోగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. పూర్తివేతనాలపై హయ్యర్ పెన్షన్ దరఖాస్తులకు సంబంధించి భెల్ విశాఖ యూనిట్ ఉద్యోగులందరినీ తిరస్కరించారని తెలిపారు. భెల్ విశాఖపట్నంలో 1996, 1997, 1998, 2006, 2011 సంవత్సరాల్లో పర్మినెంట్ అయిన కార్మికులకు పెన్షన్ పథకంలో చేరిన తేదీలు పిఎఫ్ ఆఫీసు రికార్డుల్లో తప్పుగా నమోదయ్యాయని, దీనివల్ల వందలాది మంది కార్మికులు పెన్షన్ పొందడంలో రూ.లక్షల్లో నష్టపోయే ప్రమాదం తలెత్తిందని వివరించారు. క్యాజువల్ సర్వీసుకాలంలో కూడా పెన్షన్ కాంట్రిబ్యూషన్లు చెల్లించినప్పటికీ, కేవలం పర్మినెంట్ తేదీని మాత్రమే జాయినింగ్ తేదీగా తీసుకోవడం తీవ్రమైన అభ్యంతరకర విషయమని పేర్కొన్నారు. ఈ రెండు విషయాలపై స్పందించి భెల్ కార్మికులకు న్యాయం చెయ్యాలని కోరారు. భవిష్యత్ భద్రతకోసం ఏర్పడిన పిఎఫ్ పథకాన్ని పొందడంలో కార్మికులకు జరుగుతున్న నష్టాన్ని తొలగించాలని కోరారు. దీనిపై పాండ్య స్పందిస్తూ ఈ విషయంపై అధికారులతో మాట్లాడతానని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిటిపి.ప్రకాష్, సిహెచ్.సీతాన్నాయుడు, వరాడ ఆనందరావు, విఎస్.మూర్తి, పొన్నా శివరాం, జి.అచ్చన్నాయుడు పాల్గొన్నారు.

'ఉక్కు' కార్మికులపై పనిభారం తగదు

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో కార్మికుల సంఖ్యను తగ్గించేస్తూ ఉన్న కార్మికులపై అధిక పనిభారం మోపడం తగదని ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1575వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు, ఐఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను కేంద్రం గుర్తించాలన్నారు. ప్రయివేటు వ్యక్తులకు ప్లాంట్‌ను అమ్మేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. విఆర్ఎస్ పేరుతో అనుభవం కలిగిన ఎంతో మంది ఉద్యోగులను స్టీల్‌ప్లాంట్ కోల్పోయిందని, ఆ పని భారం ఇప్పుడు యువ కార్మికులపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కాంట్రాక్ట్ కార్మికులను రోజురోజుకూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తగ్గించేస్తూ వస్తోందన్నారు. ఈ వైఖరి ఎంత మాత్రమూ తగదన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు

ప్రజాశక్తి-మధురవాడ : పాఠశాలలు తెరిచే నాటికి ఉచితంగా పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు మండలాల్లోని స్టాక్ పాయింట్లకు పాఠ్యపుస్తకాలు చేరాయి. చినగదిలి మండల పరిధి మధురవాడ, ఆడవివరం, ఆరిలోవ మారికవలస, పదదేశిపాలెం, బోరవానిపాలెం, పిఎం.పాలెం, ఎండాడ, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం, తిమ్మాపురం, బోయపాలెం తదితర ప్రాంతాల్లో 60కి పైగా ప్రభుత్వ పాఠ శాలలు ఉన్నాయి. వీటిలో 1 నుంచి పదో తరగతి వరకు సుమారు 12,475 మంది విద్యార్థులు ఉన్నారు. జూన్ 12 నుంచి పాఠశాలలు పున్ణప్రారంభం కానుండటంతో పాఠ్య, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బెల్టులు, బ్యాగులు పూర్తిస్థాయిలో చేరుకున్నాయి. బూట్లు, సాక్సులు ఇంకా రావాల్సి ఉంది. స్టాక్ పాయింట్లు వద్దనున్న సామగ్రిని పాఠశాలల వారీగా తరలించే ప్రక్రియను విద్యాశాఖ అధికారులు చేపడుతున్నారు.

విద్యార్థులపై పుస్తకాల భారాన్ని ప్రభుత్వం తగ్గించింది. గతంలో ఒకటి రెండు తరగతుల విద్యార్థులకు ఆంగ్లం, తెలుగు, లెక్కలు, వర్కుబుక్కులు కలిపి ఆరు పుస్తకాలు ఉండేవి. ఇప్పుడు వాటిని నాలుగు పుస్తకాలకు పరిమితం చేశారు. 1 నుంచి పదో తరగతి వరకు ఎనిమిది పుస్తకాల స్థానంలో సగానికి తగ్గించినట్లు చినగదిలి ఎంఇఓ సిహెచ్.రవీంద్రబాబు తెలిపారు.



రేఖవానిపాలెం చెత్త సంపద తయారీ కేంద్రాన్ని సందర్శిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ విజయశేఖర్

సంపద తయారీ కేంద్రాల సందర్శన

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : మండలంలోని రేఖవానిపాలెంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని విజయవాడ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ పి.విజయశేఖర్ గురువారం సందర్శించారు. కేంద్రం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, ఎండిఓ ఎన్.హనుమంతరావు, ఇఒపిఆర్‌డి కె.రమేష్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం: వెల్లంకి గ్రామ పంచాయతీలో ఏర్పాటుచేసిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ విజయశేఖర్ సందర్శించారు. కేంద్రాల్లో చేపడుతున్న కార్యకలాపాలు, రికార్డుల నిర్వహణను పూర్తిగా పరిశీలించి, అభివృద్ధికి అవసరమైన సూచనలిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేంద్రాల వద్ద మొక్కలను నాటుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ ప్రకాష్, సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, అధికారులు భూపతి సత్యనారాయణ, శ్రీరామ్‌మూర్తి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన కూరగాయలు విక్రయించాలి

ప్రజాశక్తి- కరాస: రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడేలా ఏర్పాటుచేసిన రైతు బజార్లో వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు విక్రయించాలని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్ ఛైర్మన్ వెంకమహంతి చంద్రశేఖర్ అన్నారు. మర్రిపాలెం ఉడా లేఅవుట్‌లోని రైతు బజార్‌ను డైరెక్టర్లు ఎలమంచిలి లలిత కుమారి, తమ్మినేని పద్మజతో కలిసి గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్‌ను పరిశీలిస్తూ రైతులు, హోల్‌సేల్ వ్యాపారులు, సూపర్ బజార్ కౌంటర్లు, వినియోగదారుల సమస్యలపై ఆరా తీశారు. రైతు బజార్లో ఉన్న స్టాళ్లు, ఎంతమంది రైతులు ఉన్నారు, వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై రైతు బజార్ ఎస్టేట్ అధికారి నారాయణరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్దేశించిన ధరలకే రైతులు కూరగాయలను విక్రయించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.తిరుమలరావు, పూసపాటి బలభద్రరాజు, బాగి వెంకట శ్రీనివాసరెడ్డి, పిటి.నాయుడు, ప్రతాప్ పాల్గొన్నారు.



రైతుబజార్ సందర్శనలో మార్కెటింగ్ కమిటీ ప్రతినిధులు

శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సుకు అడ్మిషన్లు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో ఉన్న ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ (ఎఐఐఎల్ఎస్‌జి) కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ డిప్లమా కోర్సు (1 సంవత్సరం) జూన్ 2025 – మే 2026 బ్యాచ్ కోసం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని రీజనల్ డైరెక్టర్ బీరేందర్‌సింగ్ ఫార్యాల్ తెలిపారు. ఈ కోర్సు ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు, విద్యార్థులకు సమర్థంగా ఉపయోగపడేలా రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులైతే పదవ తరగతి, ఇతర అభ్యర్థులైతే ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని వివరించారు.

ఈ కోర్సుకు సంబంధించిన తరగతులు ప్రతి ఆదివారమూ, సెలవు దినాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ డిప్లమో పూర్తిచేసిన అభ్యర్థులకు దేశవ్యాప్తంగా పలు రంగాలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. రైల్వే, విమానాశ్రయ అథారిటీలు, సాయుధ దళాలు, హోటళ్లు, హాస్పిటల్లు, మున్సిపల్ కార్పొరేషన్లు, స్వచ్ఛ భారత్ మిషన్, చమురు శుద్ధి కేంద్రాలు, మురుగు నీటి యూనిట్లు, ఆహార, ఔషధ నియంత్రణ సంస్థలు, ఎన్జీవోలు, తెగులు నియంత్రణ శాఖలు, విద్య, నిర్మాణ రంగ సంస్థలు తదితర రంగాలలో ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు. వివరాలకు ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్, రూమ్ నెంబర్ 45, గ్రౌండ్ ఫ్లోర్, ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ, సిరిపురం పెట్రోల్ బంక్ ఎదురుగా, విశాఖపట్నం వారిని లేదా కెబి.ఆదిత్య (8801437010), 7981292239 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

అభయాంజనేయ ఆలయ పునర్నిర్మాణ పనులు

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం జంక్షన్‌లో అభయాంజనేయ దేవాలయం పునర్నిర్మాణాన్ని పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు, జి.అప్పలరాజు, నరసింహనాయుడు, ఎం.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పూర్వ వైభవానికి కృషి

పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రామకృష్ణ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రజాశక్తి-భీమునిపట్నం : నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేలా కృషి చేస్తానని పార్టీ నియోజక వర్గ సమన్వయకర్త సవరదిల్లి రామకృష్ణ చెప్పారు. స్థానిక బ్యాంక్ కాలనీలో ఉన్న పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన పార్టీ నియోజక వర్గ సమన్వయకర్త బాధ్యతలను స్వీకరించారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, పార్టీ అధిష్టానం తనపై ఉంచిన ఈ బాధ్యతను త్రికరణ శుద్ధితో నిర్వహిస్తానని, ఇందుకు పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారం తీసుకుంటానని చెప్పారు. దేశానికి, రాష్ట్రానికి కాంగ్రెస్ నాయకత్వం అవసరమన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గాదం మహేష్, కెవి.సూర్యనారాయణ, కె.రామ్మోహననాయుడు, కె.వెంకటరావు, పల్లా వెంకటరావు, ఎం.గౌతంకుమార్, పి.రజనీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణను పార్టీ నాయకులు సన్మానించి అభినందించారు.



బురదమయంగా వస్తున్న కుళాయి నీరు

అధ్వానంగా కుళాయి నీరు

ప్రజాశక్తి-కొమ్మాది : జివిఎంసి 5వ వార్డు పరిధి శివశక్తినగర్‌లో కుళాయి నీరు మట్టితో కలిసి వస్తోంది. ఈ నీరు తాగడానికి, వంటకు ఉపయోగించలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నీరు తాగడం వల్ల అనారోగ్యం బారిన పడుతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జివిఎంసి అధికారులు స్పందించి కుళాయిల ద్వారా మంచినీటిని అందించాలని స్థానికులు కోరుతున్నారు.



మృతురాలి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మృతుని కుటుంబానికి రూ.5 లక్షల సాయం

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఇటీవల ప్రమాదవశాత్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగివలస గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త పేర్ల అనసూయ మృతి చెందడంతో పార్టీ అధిష్టానం మంజూరు చేసిన రూ.5 లక్షల చెక్కును స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంవిపి.కాలనీలోని ఆయన నివాసంలో గురువారం మృతురాలి కుమారుడు నానాజీకి అందజేశారు. ఇటీవలనే రూ.100 చెల్లించి ఆమె పార్టీ సభ్యత్వం తీసుకున్నారని నాయకులు చోడిపిల్లి సాయి జయ శంకర్, జోగ సన్యాసిరావు తెలిపారు. ఇదే విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లగా ఆర్థికంగా సాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, మాజీ కౌన్సిలర్ పిట్ట వెంకటరావు, నాయకులు ఉళ్ల నరసింగరావు, దుర్గారావు పాల్గొన్నారు.

ముగిసిన స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యాన మండలంలోని మూలకుద్దు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లీషుపై ఇటీవల ప్రారంభమైన వేసవి శిక్షణా శిబిరం గురువారంతో ముగిసింది. ఇంగ్లీషు భాషలో ధారాళంగా ఎలా మాట్లాడాలి, ఇతరత్ర మెలుకువలపై ఇంగ్లీష్ మాస్టారు జి.మోహనరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోహనరావు మాస్టారును విద్యార్థులు, తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు.



మోహనరావు మాస్టరుతో విద్యార్థులు, తల్లిదండ్రులు

కార్మికుల పని గంటల పెంపు దుర్మార్గం

సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు


కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో కార్మికవర్గానికి పనిగంటలు పెంచుతూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. కార్మికుల సంక్షేమం దృష్ట్యా లేబర్ కోడ్స్ అమలును రాష్ట్రంలో తక్షణమే నిలిపివేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పని విధానాన్ని పోరాడి సాధించుకున్న కార్మికవర్గంపై 12 గంటల పనిని రుద్దుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజా వ్యతిరేకమన్నారు. ఇది కార్మికుల రక్తమాంసాలు పిండి కార్పొరేట్లకు ఇబ్బడిముబ్బడిగా లాభాలు కట్టబెట్టేందుకే చంద్రబాబు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మండిపడ్డారు. సంపద సృష్టికర్తలు శ్రామికులే అనేది జగమెరిగిన సత్యమని, అయితే సంపద సృష్టికర్తలు పెట్టుబడిదారులని ఇటీవల చంద్రబాబు చెప్పారంటే కార్మికుల శ్రమను ఎంత తక్కువ చేసి చూస్తున్నారో అర్థమౌతుందని పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి జరిగి ఏఐ విస్తరించి మానవ శ్రమను తగ్గిస్తున్న ఆధునిక యుగంలో పనిగంటలు తగ్గించాల్సింది పోయి పెంచడం దారుణమన్నారు. పైగా కనీస వేతనాలు పెంచడానికి ప్రభుత్వం సిద్ధపడలేదన్నారు. తక్షణమే లేబర్ కోడ్స్‌ను, దాని అనుబంధ రూల్స్‌ను ఉపసంహరించుకోవాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. కార్మికవర్గం ఐక్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఈ దాడిని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

యాజమాన్యాలకు ఊడిగం చేయడమే : సిఐటియు

అనకాపల్లి, పరవాడ : కార్మికుల పనిగంటలు పెంచుతూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడం యాజమాన్యాలకు ఊడిగం చేయడమే అవుతుందని సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకర్లతో శంకర్రావు మాట్లాడగా, గనిశెట్టి సత్యనారాయణ ప్రకటన విడుదల చేశారు. కార్మికులకు 12 గంటల పని విధానం, మహిళలు రాత్రిపూట డ్యూటీలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజా వ్యతిరేకమన్నారు. ధరలు పెరిగి శ్రామికుల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు శక్తి తగ్గి ఆర్థిక మాంద్యానికి దారితీస్తుందని, ఈ స్థితిలో పని గంటలు తగ్గించి అదనపు ఉపాధిని కల్పించాల్సింది పోయి నిరుద్యోగాన్ని పెంచే ఈ చర్య అభివృద్ధి నిరోధకమైందని పేర్కొన్నారు. ఇటువంటి కార్మిక వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా జులై 9న జరగనున్న జాతీయ సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు


పశు దాణా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

రైతులకు పశుదాణా పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో సోమవరం గ్రామంలో 50శాతం రాయితీపై సమీకృత మిశ్రమ దాణాను అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా రైతులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. ముందుగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి ప్రభాకర్ రావు, సహాయ సంచాలకులు డాక్టర్ బి సౌజన్య, రాష్ట్ర తెలుగు రైతు అధికారి ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు, మండల పశు వైద్య అధికారి ఆల్ఫాన్స్ జార్జ్, కూటమి నాయకులు బలిజి మునిసిల నాయడు, మళ్ల బాబు, అధికారులు పాల్గొన్నారు.

నేడు మాడుగులలో మెగా ఉద్యోగ మేళా

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని వి.మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాలో 20 కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదోతరగతి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ చదివి 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉన్న యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు ముందుగా నైపుణ్యం యాప్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు మెగా ఉద్యోగ మేళాకు హాజరు కావాలని సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాలను వెబ్ సైట్ https://naipunyam.ap.gov.in/user-registrationలో నమోదు చేసుకోవాలని గోవిందరావు కోరారు. మరిన్ని వివరాలకు 81063 27482 ఫోన్ నెంబరుకు సంప్రదించాలన్నారు.

మేకుల కంపెనీ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని ఉగ్గినిపాలెం జాతీయ రహదారి పక్కన ఉన్న మేకుల కంపెనీలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ నుండి గురువారం ఉదయం 10 గంటలకు మంటలు చెలరేగాయి. పెద్ద ఎత్తున పొగ కమ్మేయడంతో అనకాపల్లి, యలమంచిలి రెండు వైపులా వెళ్లే వచ్చు వాహనాలు నిలిచి పోయాయి. విషయం తెలిసిన విద్యుత్, పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ విషయంపై తాళ్లపాలెం సెక్షన్ ఏఇ నాయుడును ఫోన్ సంప్రదించగా కంపెనీ సంబంధించిన ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయిందని, ఎటువంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.


కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్, కమ్మేసిన పొగ


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న నిర్వాహకులు

8న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం పొట్టిదొరపాలెం వివిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వడ్డి సత్యారావు ఆధ్వర్యంలో ఈ నెల 8న ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు నిర్వాహకులు గురువారం ఉపాధి హామీ కూలీలను పని ప్రదేశంలో కలిసి ఉచిత వైద్య సేవలు, బస్సు సౌకర్యం గురించి తెలియజేశారు. మండలంలోని రాజాం గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీపీ స్కూల్ వద్ద ఈ మెగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నాని పేర్కొన్నారు. ఉపాధి కూలీలకు డాక్టర్ సత్యారావు గుండెపోటుపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఈసీజీ, క్యాన్సర్ పరీక్షలు ఉచిత చేస్తారని తెలిపారు. ఎవరికీ అధిక సమస్య ఉంటే ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ఉచితంగా టూడిఇకో చేయిస్తామని,వివిధ ఆరోగ్య సమస్యలతో ఉన్నవారికి కూడా ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు, ప్రతి సోమవారం ఈ ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి ఏర్పాటు చేస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ వడ్డీ సత్యారావు తెలిపారు. ఈ వైద్య సేవలు పొందడానికి వచ్చే వారు తప్పకుండా ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఆరోగ్యశ్రీ కార్డు తీసుకురావలని, ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలందరూ కూడా వినియోగించు కోవాలని సత్యారావు కోరారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో గురువారం శంకర ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు ప్రారంభించారు. ఈ శిబిరంలో 80 మంది కంటి రోగులకు పరీక్షల నిర్వహించగా 38 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ల నిర్వహిస్తారని ఆప్తమాలజిస్ట్ అధికారి డాక్టర్ ఆర్ దేవి తెలిపారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్ సిహెచ్ అశ్విని కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నేత్ర పరీక్షలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి వైద్యులు

అధ్వాన స్థితిలో అసకపల్లి-లంకెలపాలెం రోడ్డు

-అడుగడుగునా గుంతలు

-తీవ్రంగా ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని అసకపల్లి-లంకెలపాలెం రోడ్డు అధ్వాన స్థితిలో ఉంది. అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కాలమైనా నేటికీ పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టలేదు. లంకెలపాలెం నుండి పెద ముషిడివాడ వరకు మాత్రమే మరమ్మతు పనులు చేశారు. పైడివాడ అగ్రహారం నుండి అసకపల్లి జంక్షన్ వరకు రోడ్డు గుంతలు అలాగే ఉన్నాయి. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణించడానికి తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

ఈ రోడ్డులో ఫార్మాసిటీ, హిందూజా పవర్ ప్లాంట్, ఎన్టిపిసి వంటి పరిశ్రమలకు బొగ్గు ఎగుమతులు, ఆ పరిశ్రమ నుండి ఫ్లై యాష్ వ్యర్థాలు కూడా రవాణా చేస్తున్నారు. అయితే ఈ రోడ్డులో భారీ వాహనాలు 30 -40 టన్నులు బరువుతో ప్రయాణించడం వలన రోడ్డు గుంతలు పడుతున్నాయి. మరో వైపు పైడివాడ అగ్రహారం, ఎరుకునాయుడుపాలెం, అసకపల్లి గ్రామాల ప్రజలకు దుమ్ము, ధూళి, ఫార్మా వ్యర్థాల వలన వచ్చే దూళితో పాటు విషపూరితమైన కాలుష్యం వెలువడుతోంది. దీనిపై గతంలో స్థానిక ఎమ్మెల్యేకు కూడా ఆయా గ్రామస్తులు వినతి పత్రాలు సమర్పించారు.


పైడివాడ అగ్రహారం నుండి అసకపల్లి మధ్యలో పెద్ద గొయ్యి

అయితే ప్రభుత్వం చేపట్టిన మరమ్మతులు మాత్రం లంకెలపాలెం నుండి పెద ముషిడివాడ సరిహద్దు వరకు మాత్రమే జరిగింది. మిగతా మరమ్మతులు పైడివాడ అగ్రహారం నుండి అసకపల్లి జంక్షన్ వరకు చేపట్టకపోవడంతో రోడ్డు తీవ్రమైన గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలో ప్రయాణించిన ప్రయాణికులు పలు అవస్థలు పడుతున్నారు. భారీ వాహనాలు రాకపోకలతో ఆ రోడ్డులో ప్రయాణం చేయాలంటే వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే ఈ రోడ్డులో మిగిలిపోయిన మరమ్మతు పనులను పూర్తి చేయడానికి కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


పెచ్చులూడిపోయిన గోతులు పడిన దృశ్యం

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి-పరవాడ : గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని, బకాయి పడ్డ ఎనిమిది వారాల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన మండలంలోని కలపాక గ్రామంలోని పని ప్రదేశంలో కూలీలు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కలపాకలో 8 వారాల నుండి కూలి డబ్బులు చెల్లించలేదని, ఇలా అయితే కూలీలు ఏమి తిని బతకాలని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చుతుందని, బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తుందని తెలిపారు. బడ్జెట్ పెంచాలని, ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 చెల్లించాలని, పే స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 40 శాతం సమ్మర్ అలవెన్సు, పనిముట్లు అలవెన్స్ ఇవ్వాలని, పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంటు, మంచినీరు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించకపోతే భారీ ఎత్తున ఆందోళన చేపడతామని గనిశెట్టి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు, సిఐటియు నేత గనిశెట్టి సత్యనారాయణ



విరాళం అందజేస్తున్న సోమిరెడ్డి గోవింద

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-దేవరపల్లి
మండలంలోని ముసిడిపల్లి గ్రామంలో పైడితల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు సోమిరెడ్డి గోవింద ఆలయ అభివృద్ధి నిమిత్తం లక్షా 10 రూపాయలు గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ గ్రామ పెద్దలు నిర్వహించారు అమ్మవారిని దర్శించుకున్న వారిలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టిడిపి మండల అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రినాయుడు, బొడ్డు సాంబమూర్తి, బండారు రామారావు, గంధం జగన్నాథం గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తున్న సాయిరాం ప్రభాకర్

26న అనకాపల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి- అనకాపల్లి
అనకాపల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 26న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బుద్ధ సాయిరాం ప్రభాకర్ వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆయన ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 19, 20 తేదీలలో నామినేషన్ల స్వీకరణ, 21న స్క్రూటినీ, అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యాక 23తో ప్రక్రియ ముగుస్తుందని పేర్కొన్నారు. 26న ఎన్నిక జరుగుతుందన్నారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ తదితర పదవులకు పోటీ పడే వారు తమ నామినేషన్లు నిర్ణీత రుసుం చెల్లించి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎంజెవిఎన్ కుమార్, సీనియర్ న్యాయవాదులు చందు, శ్రీనివాసరావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణం ప్రారంభం

ప్రజాశక్తి అనకాపల్లి రూరల్ : జివిఎంసి 84వ వార్డ్ సిరసపల్లి గ్రామంలో రూ.30 లక్షలతో గురువారం ఎస్‌డబ్ల్యు కాలువ పనులు ప్రారంభమయ్యాయి. వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి నీలబాబు పాల్గొని కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు నీలబాబు మాట్లాడుతూ శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, సీఎం రమేష్, పీలా గోవిందల సహకారంతో వార్డులో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జనసేన నాయకులు సిరసపల్లి సన్యాసిరావు సిరసపల్లి ప్రసాద్ (జనసేన) కనుమ రెడ్డి గోవింద్, జీవీఎంసీ అధికారులు ఏఈ కుమార్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు..



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టిడిపి నేత నీలబాబు

గోవాడ సుగర్స్ రైతులను

మోసగించిన ఎంపీ, కూటమి నేతలు

ప్రజాశక్తి-చోడవరం
అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్‌తో సహ టిడిపి కూటమి నాయకులు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులను పచ్చిగా మోసం చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకప్పుడు సహకార రంగానికి రోల్ మోడల్‌గా నిలిచి నేడు శిధిలావస్థకు చేరిన గోవాడ చక్కెర కర్మాగారాన్ని కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా పట్టించుకోకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. తనను గెలిపిస్తే సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరణ చేస్తామని, జిల్లాను పరిశ్రమల హబ్‌గా మారుస్తామని 2024 ఎన్నికల్లో వాగ్దానాలు చేసి ఓట్లు దండుకున్న సిఎం రమేష్ నేడు ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. గతంలో ఉత్పత్తి జరిగిన చక్కెర, మొలసిస్, విద్యుత్ ఉత్పత్తి వలన వస్తున్న డబ్బులనే రైతులకు, కార్మికులకు అరకొరగా ఫ్యాక్టరీ యాజమాన్యం బకాయిలు చెల్లిస్తుందని తెలిపారు. అంతేతప్ప ఈ కర్మాగారానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నుండి ఒక్క రూపాయి కూడా సహకారం అందించడం లేదని పేర్కొన్నారు. 2023-24 సీజన్లో చెరుకు సరఫరా చేసిన రైతులకు ఇంకా టన్నుకు రూ.150 చొప్పున చెల్లించవలసి ఉందని, 2024-25 సీజన్‌కు సంబంధించి ఫిబ్రవరి 4 వరకు మొదట పేమెంటుగా టన్నుకు రూ.3 వేలు చొప్పున చెల్లించిందని, నాటి నుండి ఏప్రిల్ 10 వరకు క్రషింగ్ జరిగినా రైతులకు ఇంకా పేమెంట్లు ఇవ్వలేదని తెలిపారు. దీంతో జూన్ నెల వచ్చినా చెరుకు పంట సాగుచేయాలో వద్దో తెలియని అయోమయం పరిస్థితిలో రైతులు ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలుకు కృషి చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు.

యోగాతో దీర్ఘకాలిక వ్యాధుల నివారణ



యోగాసనాలు వేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి-అనకాపల్లి
యోగా వల్ల ఆరోగ్యం బాగుంటుందని, దీర్ఘకాలిక వ్యాధులు నివారించబడగాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.బాలాజీ అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా గురువారం అనకాపల్లి పట్టణం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జిల్లా ఆయుష్ శాఖ సహకారంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉదయం 6.30 గంటల నుండి 9 గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బంది, జిల్లా మలేరియా కార్యాలయం సిబ్బంది, జిల్లా లెప్రసీ కార్యాలయం సిబ్బందితో యోగాంధ్ర ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువులు బి. అప్పారావు, దొరమ్మ నాయుడు, మంగియ్య పర్యవేక్షణలో యోగాసనలు వేశారు. జిల్లా ఆయుష్ అధికారిణి డాక్టర్ కె లావణ్య ఆధ్వర్యంలో యోగపై అవగాహన ర్యాలీని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం నుండి ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రి వరకు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి శ్రావ్యశ్రీ, అనకాపల్లి ఎన్‌టిఆర్ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ యోగా చేయాలని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు చక్రవర్తి పేర్కొన్నారు. గురువారం ఉదయం చెట్టుపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో యోగా ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రతిరోజు యోగా చేయడంతో శారీరక, మానసిక రుగ్మతల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రావణి, సర్పంచ్ గజాల సూరిబాబు మాట్లాడుతూ యోగా అనేది మానవ ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమైన సాధనమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమణ, రెల్లి సంఘ రాష్ట్ర నాయకులు ఎర్రం శెట్టి పాపారావు పాల్గొన్నారు.

త్వరలో విద్యుత్ లైన్లు పూర్తి

ప్రజాశక్తి కథనానికి విద్యుత్ శాఖ అధికారుల స్పందన

ప్రజాశక్తి-బుచ్చయ్య పేట
కొండెంపూడిలో కరెంటు కష్టాలు శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో గురువారం ప్రచురించిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వివరణ ఇచ్చారు. పోలేపల్లి సబ్ స్టేషన్ నుండి కొండెంపూడి గ్రామానికి 24 గంటల విద్యుత్ సరఫరా నిమిత్తం గత కొద్దిరోజులుగా విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లు ఏర్పాటు తదితర పనులు చేయడం జరుగుతుందని, దీని వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిందని లైన్ ఇన్స్పెక్టర్ కిల్లి సత్యం, అసిస్టెంట్ లైన్మెన్ నరసింహామూర్తి తెలిపారు. గత కొద్దిరోజులుగా విద్యుత్ లైన్‌లో స్తంభాల ఏర్పాటు తదితర పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, త్వరలో విద్యుత్తు లైన్లు బిగింపు పూర్తి అవుతుందని తెలిపారు. విద్యుత్ లైన్లు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



విద్యుత్ లైన్లు వేస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కె.కోటపాడు : విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు కారణంగా శుక్రవారం చౌడువాడలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఇ చంద్రశేఖర్ తెలిపారు. గొండుపాలెం ఫీడర్‌కు సంబంధించి చౌడువాడ మల్లం పాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎఎంఎఎల్ కళాశాల నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ కళాశాల నూతన కార్యవర్గం (2025-27) ప్రమాణస్వీకార కార్యక్రమం గురువారం కళాశాల ఆవరణలో జరిగింది. అనకాపల్లి వర్తక సంఘం కార్యదర్శులు తమ్మన రఘుబాబు, కొణతాల లక్ష్మీనారాయణరావు (పెదబాబు) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులుగా శీధరాల కృష్ణ పేర్రాజు, కరస్పాండెంట్‌గా పెంటకోట వెంకట రామారావు (శ్రీను), కార్యవర్గ సభ్యులుగా పెంటకోట ఉమామహేశ్వరరావు, పెంటకోట బాలకృష్ణ, కర్రి శివసూర్య నారాయణ, కాండ్రేగుల రవీంద్రనాథ్, దొడ్డి నూక అప్పారావు, వాసిరెడ్డి బాలకృష్ణ, బొండాడ రాజేష్, ఉద్దగిరి కృష్ణ కిషోర్ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘ ఉపాధ్యక్షులు దాడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు, కార్యాలయ పర్యవేక్షకురాలు పెంటకోట అనురాధ, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు బొడ్డేడ అప్పారావు, పెనుమత్స కృష్ణంరాజు, కొణతాల రామకృష్ణ, కొణతాల రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న నూతన పాలకవర్గ సభ్యులు

రైల్వే లెవెల్ క్రాసింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : రైల్వే క్రాసింగ్ వద్ద అనవసరమైన తొందరపాటుతో ప్రాణాలకే ప్రమాదమని రైల్వే ఎస్సై కే నవీన్ సూచించారు. అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం ప్రయాణికులకు రైల్వే పోలీసులు అవగాహన కల్పించారు. సమయం కన్నా ప్రాణం చాలా విలువైనదని, రైలు వస్తున్నప్పుడు గేటు తీయమని గేట్ మ్యాన్‌ను ఒత్తిడి చేయరాదని సూచించారు. రానున్న కాలంలో ట్రైన్ల స్పీడ్ మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అవగాహన కల్పిస్తూ పోస్టర్లను పలుచోట్ల అతికించారు. ఏఎస్ఐ ఎస్. రవి, ఎస్ఎస్ఈ వి.సోమేశ్వరరావు, సిబ్బంది సత్య నివాస్, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్లపాలెం దుర్గాలమ్మ పేట వద్ద నూతనగా నిర్మాణం చేసిన శ్రీ దుర్గాదేవి ఆలయం విగ్రహం ప్రతిష్ట గురువారం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారి ప్రతిష్ట పూజ కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పర్యావరణ దినోత్సవం

-పలుచోట్ల అవగాహనా ర్యాలీలు, మొక్కల పంపిణీ, నాటివేత



పర్యావరణ ప్రతిజ్ఞ చేస్తున్న విశాఖ కలెక్టర్ తదితరులు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. పలుచోట్ల అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞలు చేశారు.

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం స్థానిక ఆర్‌కె బీచ్ కాళీమాత టెంపుల్ నుండి ఎయు కన్వెన్షన్ సెంటర్ వరకు తలపెట్టిన గ్రీన్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలో దాదాపు 5 లక్షల మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టబోతున్నామన్నారు. కార్యక్రమంలో డిఎఫ్ఒ మంగమ్మ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టు ఆధ్వర్యాన..

విశాఖ పోర్టు అథారిటీ డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే ఆధ్వర్యాన సీ హార్స్ జంక్షన్ నుంచి హెచ్ - 8 జంక్షన్ వరకు రోడ్డు పక్కన ఒక మిలియన్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా మొక్కల పెంపకం కార్యక్రమం చేపట్టారు. పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో..

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం అనే ఇతివృత్తంతో హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ కార్యక్రమం చేపట్టింది. రిటైర్డ్ డైరెక్టర్ రాకేష్ ప్రసాద్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెచ్‌ఎస్‌ఎల్ మెయిన్ గేట్ నుంచి సింధియా జంక్షన్ వరకు మార్చ్ పాస్ట్, అనంతరం హెచ్‌ఎస్‌ఎల్ కాలనీలో ప్లాస్టిక్ కలెక్షన్ డ్రైవ్ చేపట్టారు. జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ మహాపాత్ర, ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విఎస్ఇజెడ్‌లో..

విశాఖపట్నం స్పెషల్ ఎకనమిక్ జోన్‌లో పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సెజ్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోష్ని అపరంజి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పలు యూనిట్ల అధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

గార్డినర్స్ సొసైటీ ఆఫ్ వైజాగ్ సిటీ, వనమాలి, మన కూరగాయల తోట ఆధ్వర్యంలో అడ్మిన్ జ్యోతి, ఇన్‌ఛార్జ్‌స్ శ్యామల, లావణ్య, రైతు బజార్ ఇఒ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోపాలపట్నం రైతు బజారులో మొక్కలు పంపిణీ, నాటివేత కార్యక్రమాలు చేపట్టారు.

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఇస్కఫ్, గ్లోబల్ నెట్వర్క్, సోషల్ మీడియా క్లబ్ సంయుక్తాధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జె.ప్రభాకర్ మాట్లాడుతూ భూమి పొరలను నాశనం చేస్తూ పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ వాడకంపై నిషేధాజ్ఞలను కఠినంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అరసం జిల్లా ప్రధాన



గార్డినర్స్ సొసైటీ ఆధ్వర్యాన మొక్కల పంపిణీ

కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, సోషల్ మీడియా స్టేట్ ఛైర్మన్ సన్ మూర్తి, మలయాళీ వరల్డ్ కౌన్సిల్ సెక్రటరీ జోషి, గ్లోబల్ నెట్వర్క్ ప్రతినిధి రాం ప్రభు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఎల్ఐసి బిల్డింగ్ మీదుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభ కాలేజ్ అధినేత ఓం దీపక్ మాట్లాడారు.

నక్కపల్లి:ప్లాస్టిక్, పాలిథిన్ వాడడం చాలా ప్రమాదకరమని, పర్యావరణానికి తీవ్ర విఘాతం కల్గిస్తాయని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ అన్నారు. మండలంలోని పెదబోదిగల్లం వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ దినోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా పరిశ్రమలశాఖ రాష్ట్ర సెక్రటరీ (సీనియర్ ఐఏఎస్) యువరాజ్, కలెక్టర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మున్నీషా బేగం, డీఎఫ్‌వో లక్ష్మణ్, సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సునీల్ కుమార్, రేంజ్ ఆఫీసర్ అనిల్ కుమార్, నియోజకవర్గం టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, ఆర్డీవో రమణ, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో



వైజాగ్ పోర్టు ఆధ్వర్యాన..



అవగాహన ర్యాలీలో ఇస్కాఫ్ సభ్యులు

సీతారామరాజు పాల్గొన్నారు.

కోటవురట్ల:పర్యావరణం పరిరక్షణకై ప్రతి ఒక్కరు పాటుపడాలని జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కాశి నాయుడు అన్నారు.మండల కేంద్రంలో మొక్కలు నాటారు. ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, ఏపీవో నాగరాజు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని సీహెచ్.నాగాపురంలో సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పి.సుబ్రహ్మణ్యం, మర్రి వెంకటాచలం పాల్గొన్నారు.

గొలుగొండ గురుకుల పాఠశాల, చీడిగుమ్మల, కొత్త ఎల్లవరం గ్రామాల్లో మొక్కలు నాటారు. రేంజర్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ మేరీరోజ్, ఎస్సై రామారావు, ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, సెక్షన్ అధికారి లక్ష్మణ్, డిపో ఫారెస్ట్ కెవి.రమణ, సర్పంచ్ రాంబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: చెట్టుపల్లి, నీలం పేట, నర్సీపట్నంలో మొక్కలు నాటి ఉచితంగా పంపిణీ చేశారు. డీఎఫ్ఓ ఎం సామ్యూల్, రేంజ్ ఆఫీసర్ లక్ష్మి నర్స్, జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు ఉడి చక్రవర్తి పాల్గొన్నారు.

బలిఘట్టం గ్రామంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ, 26వ వార్డ్ కౌన్సిలర్ పద్మావతి పాల్గొని మొక్కలు నాటారు. ఫారెస్ట్ రేంజర్ సుబ్బారావు, తహసీల్దార్ రామారావు , మునిసిపాలిటీ డి.ఈ. కామేశ్ రావు , జనసేన పట్టణ అధ్యక్షులు గణేష్ పాల్గొన్నారు.

రావికమతం: ప్రతి ఇంటి వద్ద మొక్కలను నాటాలని ఎమ్మెల్యే రాజు అన్నారు. రావికమతం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు రాజాన కొండ నాయుడు, ఎంపిటిసి వేపాడ నాగేశ్వరావు, ఎంపీడీవో వెంకన్న బాబు, ఉపాధి హామీ ఎపిఓ చిన్నారావు పాల్గొన్నారు.

కోటవురట్ల పర్యావరణం పట్ల దష్టి సారించాలని అవంతి విద్యా సంస్థల ప్రిన్సిపాల్ మోహన్ రావు అన్నారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు కార్యక్రమంలో డానియల్ రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవ సందర్భంగా గురువారం మండలంలోని మాకవరం గ్రామంలో కొణతాల మొక్కలు నాటారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, డిసిఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, అనకాపల్లి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నూకరాజు, సర్పంచ్ భవాని నూకరాజు, ఎంపీటీసీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్థానిక గవర పాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్ష బోర్డు కార్యదర్శి సత్యనారాయణ, ఏపీఎస్జీసి జిల్లా సమన్వయకర్త ఖగేశ్వరరావు పాల్గొన్నారు.

స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేశారు. కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ వైకుంఠరావు పాల్గొన్నారు.

అనకాపల్లి వయోవృద్ధుల సంక్షేమ సంఘం కాండ్రేగుల అప్పారావు ఆధ్వర్యంలో రైతు భారతిలో ఓరుగంటి నాగమణి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ కాండ్రేగుల నూకరాజు, డిస్ట్రిక్ట్ ఆయుష్ ఆఫీసర్ డాక్టర్ లావణ్య, పాల్గొన్నారు.

సబ్బవరం : మొక్కలు నాటడంతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి గండి బాబ్జి అన్నారు. సబ్బవరం మేజర్ పంచాయితీ శివారు గొర్లివానిపాలెం గ్రామంలో బంగారుతల్లి గుడి దగ్గర గురువారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పీబివిఎస్ఎన్ రాజు, గండి ముత్యాలయుడు, గండి దేముడు, కోరాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శాఖ గ్రంధాల యంలో గ్రంథాలయం అధికారిని వి.శిరీష విద్యార్థులచే మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ లక్ష్మి, ఆశ వర్కర్ అనురాధ పాల్గొన్నారు. సబ్బవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మధరావు, సబ్ రిజిస్ట్రార్ జిలాని బేగం గౌషియా ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శంకర్ పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి శంకర్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలోనూ, బాటజంగాలపాలెంలో గ్రామ సర్పంచ్ పడాల వెంకటరమణ, సీనియర్ నాయకులు భరిణికాన బాబురావు ఆధ్వర్యంలోనూ, ఇరువాడలో సర్పంచ్ బలిరెడ్డి కనకరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.



సినర్జీస్‌లో మాట్లాడుతున్న రాజు



హెచ్‌ఎస్‌ఎల్‌లో...

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామంలో సంపద తయారీ కేంద్రం వద్ద ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ దాకారపు నాగేశ్వరిదేవి, గోకివాడ కోటేశ్వరరావు, సర్పంచ్ పి.మాణిక్యం, గోన్నాబత్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక అయ్యన్న డిగ్రీ కళాశాలలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ముర్రు ముత్యాల నాయుడు ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాసీం, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం అధికారి సిముసిరి రమణ, గాడి అప్పారావు , ప్రిన్సిపాల్ సుమతి విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలోని పాండవుల చెరువు ఆవరణలో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో వడ్డాది సచివాలయం వద్ద గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు దొండా నరేష్, వైద్యాధికారి రమ్య, దూది రాజేష్, తలారి శంకర్ పాల్గొన్నారు. కొండపాలెంలో సర్పంచ్ ఎం భవాని, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు ముచ్చకర్ల తాతయ్యలు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

మునగపాక : మండలంలోని మెలుపాక గ్రామ కమిటీ హాల్లో గురువారం పర్యావరణం సమతుల్యతపై సమావేశం జరిగింది. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, కాళ్ళ చంద్రమోహన్, రాజశేఖర్, మాధవ్, పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం, అంబెరపురం, గోవాడ తదితర గ్రామాల్లో స్థానిక శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్ రాజు మొక్కలను నాటారు. కార్యక్రమంలో సుగర్స్ ఎమ్‌డి వి సన్యాసినాయుడు, ఎంపీడీవో ఆంజనేయులు, పిఓపిఆర్డి, మహేష్, ఈవో నారాయణ రావు, మండల టిడిపి అధ్యక్షులు బొడ్డేడ నాగ గంగాధర్ పాల్గొన్నారు.

ఉక్కునగరం : విఎస్ఇజెడ్‌లోని సినర్జీస్ క్యాస్టింగ్ లిమిటెడ్ కంపెనీలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ బిఎస్ఎన్.రాజు మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడకం ప్రమాదమన్నారు. ప్లాస్టిక్ భూసారాన్ని నాశనం చేస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడటానికి దూరంగా ఉండాలని భూమిని సంరక్షించుకోవాలని కోరారు. అనంతరం కంపెనీ పరిసర ప్రాంతాలలో సుమారు 300 మొక్కలను నాటారు. ప్రకృతి పరిరక్షణ అంశాలపై పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉక్కునగరం క్లబ్‌లోని మల్టీపర్పస్ హాల్‌లో ఆర్ఐఎన్ఎల్ ఆధ్వర్యాన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అరుణ్ కాంతి బాగ్చి మాట్లాడారు.

పద్మనాభం : అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాండ్రంగి పంచాయతీ పరిధిలో కొబ్బరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శారద, నాయకులు మహంతి అప్పలరమణ, శారధి, మైలపల్లి శివ పాల్గొన్నారు.

పద్మనాభం పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయ కన్నయ్య కోనేరు గట్టుపైన ఎంపిపి కె.రాంబాబు ఆధ్వర్యాన కొబ్బరి మొక్కలను నాటారు. ఎంపిడిఒ ఎం.విజయ్‌కమార్ పాల్గొన్నారు.




విఎస్ఇజెడ్‌లో...



మ్యాపును పరిశీలిస్తున్న యువరాజ్, కలెక్టర్

కారిడార్ పనుల పరిశీలన

ప్రజాశక్తి నక్కపల్లి: వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ లో భాగంగా పరిశ్రమల స్థాపన కోసం మౌలిక వసతుల కల్పనకు చేపడుతున్న పనులను పరిశ్రమలశాఖ రాష్ట్ర సెక్రటరీ యువరాజ్, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ పరిశీలించారు. మండలంలో గురువారం భూసేకరణ ప్రభావిత గ్రామాల్లో పర్యటించి, పరిశ్రమ స్థాపన కోసం చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఇందుకు సంబంధించిన మ్యాపులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరతగతిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. పరిశ్రమల స్థాపన కోసం అదనంగా కావలసిన భూమిని సేకరించి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రమణ, తహసిల్దార్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రాజు

ఆస్తి పన్ను సర్వేను నిలిపివేయాలి : సిపిఎం

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మున్సిపాల్టీ లో జరుగుతున్న ప్రాపర్టీ ట్యాక్స్ (ఆస్తి పన్ను) సర్వే ను తక్షణమే నిలిపివేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ, ప్రజల పై ఆస్థి ఆదారిత పన్నులు వేయడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపాల్టీలో ఆస్థి ఆదారిత పన్నులు విదించేందకు ఇళ్ళు, స్థలాల సర్వే చేపట్టారని పేర్కొన్నారు. నర్సీపట్నం మున్సిపాల్టీలో సుమారు 10వేల కుటుంబాలు ఉన్నాయని, అదిక భాగం రోజువారీ కూలీలు, మద్య తరగతి ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. ఈ పన్నులు భారంతో ఇంటి అద్దెలు పెరుగుతాయన్నారు. నేటికీ పేదలకు టిడ్కో ఇళ్ళు ఇవ్వలేదన్నారు. తక్షణమే సర్వే ను నిలిపివేయక పోతే ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాపిరెడ్డి నారాయణముర్తి, ఈ.చిరంజీవి పాల్గొన్నారు.

పని గంటల పెంపు దారుణం

ప్రజాశక్తి -నక్కపల్లి: రాష్ట్రంలో కార్మికుల పని గంటల పెంచుతూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిఐటియు మండల కార్యదర్శి ఎం రాజేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం దృష్ట్యా లేబర్ కోడ్స్ అమలను రాష్ట్రంలో నిలిపివేయాలని డిమాండ్ చేసారు. 8 గంటల పని కోసం పోరాడి సాధించుకున్న కార్మికులపై 12 గంటల పనిని రుద్దుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజా వ్యతిరేక చర్య అన్నారు. కార్పొరేట్లకు లాభాలు కట్టపెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. పైగా కనీస వేతనాలు పెంచడానికి ప్రభుత్వం సిద్ధపడలేదని, ఒకవైపు ధరలు పెరిగి శ్రామికుల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

చింతపల్లిలో భారీ వర్షం

ప్రజాశక్తి-చింతపల్లి: మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం నుండి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో గాలివాన దాటికి మారుమూల గ్రామాల నుంచి వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల కేంద్రం లోని ప్రధాన రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. రోడ్డుపై వరద నీరు చేరడంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడింది.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మండలంలోని చెట్టుపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటారు. మే నెల 30 నుండి ఒకటో తేదీ వరకు డిల్లీలో ఇండియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థులు పూర్వజ గోల్డ్, బ్రాంజ్ మెడల్ సాధించింది. ఎం. అమృతవల్లి గోల్డ్ మెడల్, సి. హెచ్. కావ్య సిల్వర్ పతకాలు సాధించారు. విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం వి. సరోజినీ, పాఠశాల చైర్మన్ ఈశ్వరరావు సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, తమ గ్రామానికి చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం పట్ల తమకు, తమ గ్రామానికి గర్వకారణంగా ఉందన్నారు. విద్యార్థులను ప్రోత్సహించిన ప్రధానోపాధ్యాయురాలు సరోజినీ, ఫిజికల్ డైరెక్టర్ దేవిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, బి.రాఘవనాయుడు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు


జూనియర్ బాక్సింగ్ టోర్నీకి జ్యోతి ఎంపిక



ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఈనెల 5 నుండి 10 వరకు జరుగుతున్న జూనియర్ బాలికల బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో నర్సీపట్నం బాక్సర్ గండి జ్యోతి 52 కేజీ ల విభాగంలో పాల్గొంటుందని నింజాస్ అకాడమీ కోచ్ అబ్బు తెలియజేశారు. ఈ పోటీలు గోవాలోని ఇండోర్ స్టేడియంలో జరుగుతు న్నాయన్నారు. తల్లిదండ్రులు తోపుడు బండి వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారని, అయినా కుమార్తె క్రీడల్లో మంచి స్థాయికి వెళ్లాలని ప్రోత్సహిస్తున్నారన్నారు. జ్యోతిని ఇప్పటికే 4 సార్లు నేషనల్ కీ పంపించారని తెలిపారు.

82 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

డిఎఫ్ఓ లక్ష్మణ్



మాడుతున్న డిఎఫ్ఓ లక్ష్మణ్

ప్రజాశక్తి- నక్కపల్లి: అనకాపల్లి జిల్లా పరిధిలో పర్యావరణం పరిరక్షణ ధ్యేయంగా ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో 82 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యం పెట్టుకున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి జీ లక్ష్మణ్ అన్నారు. గురువారం నక్కపల్లి వచ్చిన ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడారు. 2047 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో అటవీ భూముల శాతం పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. జిల్లా వ్యాప్తం గా 90 నర్సరీలు ఏర్పాటు చేసి, పంపిణీకి మొక్కలను సిద్ధంగా వుంచామన్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయం గా పేపర్ మిల్స్, ఉద్యానవనశాఖ.డుమా, అటవీశాఖల సమన్వయంతో మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా నాటే 82 లక్షల మొక్కల్లో సరుగుడికి అధిక ప్రాధాన్యత ఇస్తు న్నామని, ఇది తక్కువ పెట్టుబడితో రైతులకు అధిక లాభాలిస్తుందన్నారు. దాదాపు 70 లక్షల మొక్కలు సరుగు డు నాటుతామని, మిగిలిన 12 లక్షల మొక్కలు పలు రకాల జాతులుంటాయని చెప్పారు. రైతుల పొలాల్లో కూడా సరుగుడు పెంచుకోవడానికి ఉచితంగా నారు ఇస్తామని చెప్పారు. ఎప్పటికప్పుడు నర్సీపట్నం, అనకా పల్లి, యలమంచిలి, చోడవవరం రేంజ్ కార్యాలయాల పరిధిలో ఎప్పటికప్పుడు మొక్కల పెంపకంపై మోనటరింగ్ చేస్తామన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

గురుకుల ప్రిన్సిపాల్‌గా ఉషారాణి

ప్రజాశక్తి-నక్కపల్లి: నక్కపల్లి గురుకులం ప్రిన్సిపాల్ గా యు.ఉషారాణి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇన్చార్జి ప్రిన్సిపల్ గా సువర్ణ కుమారి వ్యవహరించారు. పదోన్నతపై ఉషారాణి గురుకులం ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టడంతో, ఇన్చార్జి ప్రిన్సిపల్ గా వ్యవహరించిన సువర్ణ కుమారి, ఇతర ఉపాధ్యాయులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు



నర్సీపట్నంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులు ఇంతవరకు నేర్చుకున్న విషయాలను గ్రంథాలయధికారిణి దమయంతి ఒక్కక్కరిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభిప్రాయాలను అడిగారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పి. ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. హైస్కూల్ విద్యార్థులకు క్రాఫ్ట్ వర్క్ పోటీలను నిర్వహించారు.

గొలుగొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో గురువారం వేసవి శిక్షణా శిబిరాన్ని కొనసాగించారు. ఈ మేరకు విద్యార్థులచే బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. గ్రంథాలయాధికారి మాట్లాడుతూ ప్రతిరోజు గ్రంథాలయం కి రావాలని సూచించారు. చదువుతో పాటు ఆటలపై దృష్టి పెట్టాలన్నారు.



సన్మానిస్తున్న కూటమి నాయకులు

వెంకటేష్‌కు అభినందనలు

ప్రజాశక్తి-నక్కపల్లి: పాయకరావుపేట నియోజక వర్గం టిడిపి కన్వీనర్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన టిడిపి నేత కొప్పిశెట్టి వెంకటేష్ కు కూటమి నాయకులు అభినందనలు తెలియజేశారు. మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వెంకటేష్‌ను సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పిక్కి రాంబాబు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి కోదండరావు (బుజ్జి), సొసైటీ ప్రెసిడెంట్ పిక్కి కోదండరావు, పిక్కి దేముడు, వాసపల్లి శివాజీ, నాగేష్, తాతీలు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న ఎస్ఐ

అల్లూరి పార్కు వాచ్‌మ్యాన్‌కు సత్కారం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవి పేట అల్లూరి పార్కులో వాచ్‌మ్యాన్‌గా పని చేస్తున్న లగుడు చినబాబును గురువారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు ఘనంగా సత్కరించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ, గత 12 ఏళ్లుగా అల్లూరి పార్కు వాచ్‌మేన్‌గా ఉంటూ కొన్ని వందల మొక్కలను సంరక్షిస్తున్నారన్నారు. అనంతరం పార్కు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లపై చెట్టుకొమ్మలను తొలగించరూ..

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి నుండి ఉపమాక వెళ్లే ప్రధాన రహదారిపై విద్యుత్తు వైర్లు పై చెట్టుకొమ్మ విరిగిపడిందని, అదేవిధంగా మర్రిచెట్టు కొమ్మలు విద్యుత్ వైర్లు పై వేలాడుతూ ఉన్నాయని, విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోలేదని తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్చార్జి కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. చెట్టుకొమ్మ విరిగి విద్యుత్ వైర్లు పై పడి నెల రోజులు అవుతున్నా నేటికీ తొలగించలేదని, స్థానిక విద్యుత్ శాఖ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు అధికారులు స్పందించి విద్యుత్ వైర్లు పై వేలాడుతున్న చెట్టు కొమ్మలను తొలగించాలని డిమాండ్ చేశారు.

'పాడేరు 12వ మైలు' లో ఏముంది ?

-నేడే విడుదల - పాడేరుకు చెందిన దర్శక, నిర్మాతల సారథ్యం

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు 12వ మైలురాయి జంక్షన్ తెలియని వారు ఉండరు. ఘాట్ రోడ్లో నిత్యం ప్రయాణించే వారికి ఈ జంక్షన్ చాలా సుపరిచితం. ప్రస్తుతం ఈ జంక్షన్ వివిధ రకాల ఫలసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కు ప్రసిద్ధికెక్కింది. ఇప్పుడు ఈ "పాడేరు 12వ మైలు" అనే పేరుతో ఒక ప్రేమ కథ చిత్రాన్ని సాయి లక్ష్మి గణపతి మూవీ క్రియేషన్స్ బ్యానర్ పై పాడేరు కు చెందిన యువ నిర్మాత గ్రంధి త్రినాథ్ నిర్మించారు. మన్య ప్రజల ఇలవేల్పు ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ అమ్మవారి ఇతివృత్తాన్ని జోడించి ఉత్కంఠ భరితంగా సాగే ప్రేమ కథ చిత్రాన్ని పాడేరుకు చెందిన యువ దర్శకుడు ఎన్. కె.సాయి తమ అభిరుచి మేరకు పాడేరు సమీప అందమైన పరిసరాల్లో ఆసక్తికరంగా చిత్రీకరించారు. పాడేరు కు చెందిన ఈ నవ యువ దర్శక నిర్మాతలు తమ తొలి ప్రయత్నంగా" పాడేరు 12వ మైలు " చిత్రాన్ని రూపొందించడం పట్ల ఈ ప్రాంతంలోని ప్రముఖులు, వర్తకులు ప్రజా ప్రతినిధులు అభినందిస్తూ ఈ చిత్రం విజయవంతం కావాలని అభిలషిస్తున్నారు.

ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాల్లో ఈ చిత్రాన్ని 18 థియేటర్లలో ఈనెల 6న శుక్రవారం విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం, ట్రైలర్ ను ఇటీవల 'నటకిరీటి' 'రాజేంద్రప్రసాద్' విడుదల చేశారు. ఈ "పాడేరు 12వ మైలు" చిత్రంలో నూతన ఆర్టిస్టులతో పాటు "జబర్దస్త్" నటీనటులు, సత్యం రాజేష్, శ్రవణ్ , కాలకేయ ప్రభాకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.